క్లుప్తంగా

ప్రవేశాలకు ఆహ్వానం

కోస్గి రూరల్: మండలంలోని నాచారం గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి విజయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీ తెలుగు మీడియం విభాగంలో 20 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు విద్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకొని అడ్మిషన్‌లు పొందాలని కోరారు.

108లో మహిళ ప్రసవం



మద్దూరు/నారాయణపేట రూరల్: మండలంలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన ఓ మహిళ 108లో ప్రసవించింది. గ్రామానికి చెందిన మొగులమ్మకు మంగళవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బంది నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించే క్రమంలో అప్పక్‌పల్లి దగ్గర నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ శిరీష ప్రథమ చికిత్స అందించడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

రైతులకు అందుబాటులో యూరియా

కోస్గి రూరల్: రైతులకు సరిపడినంతగా యూరియా అందుబాటులో ఉందని ఏడీఏ రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 4 మండలాలకు చెందిన రైతుల కోసం 12,918 బస్తాల యూరియా మండలకేంద్రానికి వచ్చినట్లు తెలిపారు. కోస్గి మండలంలో 5582 ,గుండుమాల్‌లో 555, కొత్తపల్లిలో 2100 , మద్దూర్‌లో 4681 యూరియా బస్తాలు అగ్రోస్ , ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం , హకా , ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు అవసరం మేరకే యూరియా వాడాలని , తప్పనిసరిగా ఆధార్ సమర్పించి యూరియాను తీసుకెళ్లాలన్నారు. ఎరువుల సరఫరాలో సమస్యలు ఏర్పడితే టోల్ ఫ్రీ నంబరు 89777 41771 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్రీడా సామగ్రి పంపిణీ



నారాయణపేట రూరల్: మండలంలోని అప్పిరెడ్డిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలు అందజేశారు. ఆ సంఘం టౌన్ నూతన అధ్యక్షుడు వెంకటేష్ జన్మదినం సందర్భంగా మంగళవారం పిల్లలకు అవసరమైన ఆట వస్తువులను కొనుగోలు చేసి పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అందుకు తనవంతుగా క్రీడాసామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు మధుసూదన్ రెడ్డి, రామాంజనేయులు, మహేష్, వెంకటేష్, రాంరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్త మృతికి సంతాపం

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రం సమీపంలోని అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ ధర్మకర్త మృతి చెందారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో నివాసం ఉంటున్న కాలాల్ శ్రీనివాస్ గౌడ్ (80) ఆలయాన్ని నిర్మించి నిత్యం తానే పూజలు చేస్తుండేవాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం మరణించడంతో పట్టణంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పరిషత్ కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

పూజారుల సంఘం అధ్యక్షుడిగా నర్సింహులు



ధన్వాడ: దూపదీప నైవేద్య ధన్వాడ మండల అర్చకుల సంఘం మండల అధ్యక్షుడిగా ధన్వాడకు చెందిన పటేల్ నర్సింములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జిల్లా అధ్యక్షుడు మడపతి జ్ఞానేశ్వర్ ప్రధాన కార్యదర్శిజోషి రామాచారి, ఉపాధ్యాయులు జయతీర్థ చార్యులు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలో అర్చకులు పురంధచార్యులు, సుంకునర్సింములు, నాగరాజు, జోషి, మఠం చంద్రశేఖర్, ప్రఖార్, మోనాచార్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే.. బిల్లులు

- పేదల సొంతింటి కలకు కొర్రీలు
- ఖాళీ స్థలంలోనే ఇంటి నిర్మాణం
- 29 పంచాయతీల్లో 423 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్



గత్పు గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు

దామరగిద్ద: నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా లబ్ధిదారులను గుర్తించి ప్రొసీడింగ్ పత్రాలు కూడా అందజేశారు. కాగా తీరా ప్రొసీడింగ్‌లో మంజూరైన తరువాత కొంతమంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించడం లేదంటూ కొర్రీలు విధించడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో 30 జీపీల పరిధిలో వెరిఫికేషన్ అనంతరం 423 మందిని ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అర్హులుగా గుర్తించి ప్రొసీడింగ్‌లు అందజేశారు. తీరా ఇళ్లు నిర్మించుకుందామనుకున్న లబ్ధిదారులకు నిబంధనల పేరుతో కట్టుకున్న బిల్లులు అందుతాయో లేదోనన్న భయంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పైలట్ గ్రామంలోనూ నిర్మాణాలు తక్కువే..

ప్రభుత్వం తొలుత పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని గత్పు గ్రామాన్ని ఎంపిక చేసి 72 అర్హులను గుర్తించి ఇల్లు మంజూరు చేసింది. అయితే వివిధ కారణాలతో కేవలం 22 మంది లబ్ధిదారులు మాత్రమే ఇంటి నిర్మాణం పనులు చేపట్టగా ఇప్పటి వరకు బేస్‌మెంట్, లెంటల్, లెవల్ బిల్లులు మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన వారిలో నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టలేకపోవడం లేదా సరిపడా స్థలం లేకపోవడం తదితర కారణాలతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు.

నిబంధనల పేరుతో కొర్రీలు

- ఇల్లు మంజూరైన లబ్ధిదారులు పథకం నిబంధనల ప్రకారం 400 గజాలకు తగ్గకుండా, 600 గజాల కంటే ఎక్కువ కాకుండా ఉన్న స్థలంలోనే నిర్మాణం చేపట్టాలి.
- అధికారులతో ప్లాన్ (ముగ్గు) వేసి ప్రారంభించే ఇళ్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తేనే బిల్లులు మంజూరు అవుతాయి.
- ముందుగానే పిల్లర్ గుంతలు తవ్వినా లేదా బేస్‌మెంట్ లెవల్ వరకు ముందే నిర్మాణం చేపట్టి ఉన్న ఇళ్లకు ఇందిరమ్మ పథకం వర్తించదు.
- గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ఈ పథకం కింద నిధులు మంజూరు చేయరు.
- ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులుగా గుర్తించి మంజూరు చేసిన నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం లేకపోయిన బిల్లులు రావని అధికారులు చెప్పడంతో ఇంటి నిర్మాణాలపై లబ్ధిదారులు వెనకడుగు వేస్తున్నారు.

మంజూరు కాలేదంటున్నారు..



సొంతిల్లు లేకపోవడంతో ప్రభుత్వం తప్పకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందనే నమ్మకంతో ముందుగానే బేస్‌మెంట్ లెవల్ వరకు పనులు పూర్తి చేశాను. మొదట్లో ఇల్లు మంజూరైందన్నారు. ఇప్పుడెమో ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు కాలేదని చెబుతున్నారు. సొంతిల్లు లేని తనలాంటి వాళ్లకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

–నర్సమ్మ, మద్దెల్‌బీడ్

నిబంధనల ప్రకారమే నిర్మించుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల కోసం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు అర్హులను గుర్తించాం. ఇక నిర్మాణంలోనూ నిబంధనల ప్రకారం గుర్తించిన స్థలంలో ముగ్గు వేసి పనులు ప్రారంభించినప్పటి నుంచి ఆన్‌లైన్‌లో పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తేనే బిల్లులు మంజూరవుతాయి. నిబంధనలు పాటించకపోతే బిల్లులు మంజూరు కావు.

–సాయిలక్ష్మి, ఎంపీడీఓ, దామరగిద్ద

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికుల బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరక మంగళవారం డీఈఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రూ.3 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు అప్పుల పాలవుతున్నారని, వడ్డీలు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ పాటించడం లేదంటూ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. బిల్లులు మంజూరు చేయకుంటే జూలై 28న మరోసారి జిల్లా అధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఈవో గోవిందరాజు, మధ్యాహ్న భోజన ఇంచార్జి యాదయ్యశెట్టికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతమ్మ, పద్మమ్మ, బాలమణి, యాదమ్మ, మైబుబి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను ఆదుకోవాలి

ఊట్కూరు: భూనిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐఎం జిల్లా నాయకులు వెంకటరామారెడ్డి కోరారు. మంగళవారం ఊట్కూరులో మక్తల్-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూమి కోల్పోతున్న రైతులతో కలిసి గ్రామపంచాయతీ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మోట్కుర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరాకు రూ.14 లక్షలు ఇవ్వడం సరికాదన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.30 నుంచి రూ. 40 లక్షల వరకు ధర పలుకుతున్న భూములకు ప్రభుత్వం ఇంత తక్కువగా చెల్లిస్తే తాము ఒప్పుకోమన్నారు. ప్రభుత్వం పథకం ప్రకారం నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామారెడ్డి, నాయకులు సురేందర్, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా అమలుచేయాలి



కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

నారాయణపేట రూరల్: రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ఆ సంఘం రాష్ట్ర నాయకులు గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. రైతులను ఆదుకోవడానికి తీసుకొచ్చిన ఫసల్ బీమా యోజనతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని దుయ్యబట్టారు. రైతు భరోసా సైతం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే వేసిందని తర్వాత వేయదన్నారు. రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బోనస్ డబ్బులు చెల్లించి రాష్ట్రంలో వెంటనే ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని, ఎన్నికల హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాల్ రెడ్డి, నర్సింహులు, నర్సన్ గౌడ్, బలరామ్ రెడ్డి, ఉదయబాను, రామచంద్రయ్య, ఉమేష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూర్: పోలీస్ అధికారు లు, సిబ్బంది ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎ స్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, కేసుల నమోదు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, గేమింగ్, బెట్టింగ్, గంబ్లింగ్ జరగకుండా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని, చోరీలు జరగకుండా గస్తీలు నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలోని వార్డులకు, గ్రామాలకు పోలీసు అధికారులను కేటాయించి సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో సమాచారం రాబట్టాలన్నారు. పోలీసులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమయపాలనతో ఉండాలని, సమస్యల పట్ల నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి చేరుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించి ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించాలన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే ధ్యేయంగా పాలన



మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న కమిషనర్ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు

మద్దూరు: మహిళల ఆర్థిక ప్రగతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని కోస్గి ఏఎంసీ చైర్మన్ ముద్ది భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా అన్నారు. మంగళవారం రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కుట్టు మిషన్లను మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల, మద్దూరులోని ముస్లిం మహిళలకు పుర కమిషనర్ శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, ఉసేన్, యాసీన్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 243 మంది మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే మైనార్టీ కార్పొరేషన్ నుంచి ముస్లిం రైతులకు రూ.2 లక్షల విలువ చేసే గేదలను కొనుగోలు చేయడానికి మండలానికి 623 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.1.60 లక్షలు సబ్సిడీ ఉంటుందని అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబుస్వామి, ఆశోక్, పురోషోత్తం, ఉస్మాన్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన ప్రతి పథకం అమలుచేస్తాం



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, నాయకులు

ధన్వాడ/దామరగిద్ద: మేనిఫెస్టోలో పెట్టిన హామీలే కాకుండా ప్రజలకు అవసరమైన ప్రతి పథకాన్ని అమలు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం ధన్వాడ మండల కేంద్రంలోని ఫాంక్షన్‌హాల్‌లో ధన్వాడ, మరికల్ మండలాలకు చెందిన ప్రజలకు కొత్త రేషన్‌కార్డులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు గ్యారంటీలలో సన్న బియ్యం పంపిణీ హామీ ఇవ్వకపోయినా ప్రజలు దొడ్డు బియ్యం తినలేకపోతున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేదలందరికీ సన్న బియ్యం పథకం అమలుజేస్తున్నట్లు తెలిపారు. అలాగే గత పదేళ్లుగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో లక్షలాది మంది రేషన్ సరుకులు అందక ఇబ్బందులు పడుతుండటంతో ప్రభుత్వం వారికి రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం కేవలం రైతులకు రైతుబంధు అందజేసి చేతులు దులుపుకుందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలో ప్రభుత్వం ఉన్న పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వ సహకారం అందడంతో పాటు ప్రతి ఇంటి సమస్య పరిష్కరించేందుకు సులభం అవుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ

కొత్తపల్లి: మండల పరిధిలోని లబ్ధిదారులకు కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారటీ (కడా) అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్‌కుమార్ మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని 13 గ్రామాల్లోని 106 కుటుంబాలకు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. దాదాపు 1077 మంది లబ్ధిదారులు ఉన్నారని తహసీల్దార్ జయరాములు తెలిపారు. రేషన్‌కార్డుల కావాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మూడు రోజుల్లో నూతన రేషన్ కార్డు మంజూరవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, పార్థివగౌడ్, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


335 మందికి కార్డుల అందజేత

కోస్గి రూరల్: గుండుమాల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలానికి మంజూరైన 335 రేషన్‌కార్డులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ , తహసీల్దార్ భాస్కరస్వామి , మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి , పీఏసీఎస్ అధ్యక్షుడు తూం బీంరెడ్డి, ప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 12వ వార్డులో మొదటి విడుతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరై బేస్మెంట్ నిర్మించుకున్న లబ్ధిదారురాలు సాజిదా బేగంకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం దశల వారీగా బిల్లులను మంజూరు చేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు దురుద్దేశంతో ఇందిరమ్మ బిల్లులు రావని తప్పుడు ప్రచారం చేస్తూ అపోహలు సృష్టిస్తున్నారని వాటిని లబ్ధిదారులు నమ్మొద్దన్నారు. రాబోయే మూడేళ్లలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి.సలీం పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ



నల్లజానమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

మక్తల్: పట్టణంలో బోనాల పండుగను మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. భావసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం తుల్జాపూర్ భవనీ మాతాకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

నర్వ/ధన్వాడ: మండలంలోని పెద్దకడ్మూర్‌లో పోలేరమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అంబలి నైవేద్యాన్ని సమర్పించారు. సాయంత్రం పసుపుకుంకుమలతో ముస్తాబు చేసిన బోనాలతో మహిళలు ఊరేగింపు

బీటీ రోడ్డును పరిశీలించిన అధికారులు



కొత్తపల్లి: మండల కేంద్రంలో మద్దూరు నుంచి లింగల్‌చేడ్ వరకు నిర్మాణం చేపట్టిన బీటీ రోడ్డు పనులను ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాస్‌కుమార్, ఏఈఈ మనోజ్, వనం, బాలరాజ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో 15.05 కిలోమీటర్ల రోడ్డును రరూ.39 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. అనంరం రోడ్డు నిర్మాణం, నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ రాములు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

మరికల్: ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యాక్షుడు వెంకటేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆటోలను నిలిపి రూ.12 వేలు వెంటనే జమ చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో కార్మికుల బతుకు ఛిద్రమైందన్నారు. మహిళలు ఆటోలు ఎక్కకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ డ్రైవర్లు కుర్మయ్య, ఆనంద్, నర్సిములుగౌడ్, కుర్మన్న, రాజ్‌రెడ్డి, కురుమూర్తి , కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

మద్దూరు: మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణం చేపట్టాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి 439 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 324 మంది ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారన్నారు. 50 ఇళ్లు ఆధార్ తప్పిదాలు, ప్రస్తుతం ఇక్కడ లేకపోవడం, తదితర కారణాలతో ప్రారంభం కాలేదన్నారు. మిగిలిన 65 ఇళ్లకు రెండు రోజుల్లో మార్కింగ్ వేయనున్నట్లు తెలిపారు.

మూడు దశల్లో ఆందోళనలు

నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి మూడు దశల్లో ఆందోళనలు చేస్తున్నట్లు టీపీటీఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్, రెడ్డప్ప తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలను గుర్తించి, ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. ఈ నెల 23న మండల కేంద్రాలలో నిరసన తెలియజేసి తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో ధర్నా, ఆగస్టు 23న చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆందోళనల్లో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వెంకటప్ప, గజలప్ప, ఉదయ్ పాల్గొన్నారు.

రూ.1.24లక్షల రికవరీకి ఆదేశాలు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలో 2024–25 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డీఆర్‌డీఏ పీడీ మొగులయ్య అధ్వర్యంలో సామాజిక తనిఖీ కొనసాగుతుంది. మొత్తం రూ.6.32కోట్ల పనులు జరగగా వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు 24 గ్రామ పంచాయతీలలో జరిగిన ప్రజావేదికలో ప్రధానంగా కూలీల సంతకాలు ఫోర్జరీ, కొలతల్లో తేడాలు, ఎంపీడబ్ల్యూ పనుల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీతో ఈ గ్రామాల్లో జరిగిన పనులపై రూ.4వేలు జరిమానా, రూ.1.24లక్షలను రికవరీకి ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రామన్న, పీఆర్ డిప్యూటీ విలోక్, ఉమ్మడి మద్దూరు మండల ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మక్తల్‌లో భారీ వర్షం



మక్తల్: పట్టణంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపిలేని వర్షంతో స్థానిక యల్లమ్మ కుంట, బస్టాండ్ , గుర్లపల్లి రోడ్డుపై నీరు నిలిచి చెరువులను తలపించాయి. మురుగు కాల్వలు నిండి చెత్త చెదారం అడ్డు పడడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

కోస్గి రూరల్: ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవాటు చేసుకోవాలని పాలమూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్, ఇన్‌స్టాలేషన్ అధికారి నటరాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలో 32వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్లబ్ సహకారంతో ఎందరో చిన్నారులకు తమ వంతుగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బస్టాండ్‌లో బంగారం చోరీ

నారాయణపేట రూరల్: సినీఫక్కీలో మహిళలు బంగారం చోరీ చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్కూరు మండలం పెద్దజట్రానికి చెందిన లక్ష్మీ మంగళవారం నారాయణపేటకు వచ్చి పని ముగించుకుని సాయంత్రం స్వగ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చింది. ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు దుకాణ సముదాయాల వెనకకు వెళ్లగా ఇద్దరు మహిళలు బుర్ఖాలో వచ్చి గొంతు దగ్గర పురుగు ఉంది అంటూ దాన్ని తీస్తున్నట్లు నటించి లక్ష్మీ నోట్లో మద్యం పోశారు. ఆమెకు అర్థమయ్యే లోపు మెడలో ఉన్న తులం బంగారు చైను కాళ్లకు ఉన్న పట్టీలు లాక్కొని పారిపోయారు. బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. చోరీకి పాల్పడిన వారు దామరగిద్ద మండలం కంసాన్ పల్లికి చెందిన మహిళలుగా గుర్తించి పట్టుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానిక టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లును వివరాలు అడగగా ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

మీసేవ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

కోస్గి రూరల్: మండల పరిధిలోని బిజ్జారం గ్రామంలో మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 21 నుంచి 44 ఏళ్లలోపు ఉండి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే కంప్యూటర్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు రాత పరీక్షతో పాటు మౌఖిక పరీక్ష నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 26వ తేదీలోగా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

దామరగిద్ద: సమాజ సేవే పరమావధిగా లయన్స్ క్లబ్ అందజేస్తున్న సేవలు ఎనలేనివని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు.